
సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 9 । జనవరి । 2023



తగ్గేదేలే!
సంక్రాంతి బరికి సై అంటూ పందెంకోళ్లు కాలు దువ్వుతున్నాయి. -8లో..



రూ. 14.77 కోట్లతో మామిడి గుజ్జు పరిశ్రమ
జిల్లాకు రూ. 14.77 కోట్లతో మామిడి, టమాట గుజ్జు పరిశ్రమ మంజూరైందని జిల్లా ఉద్యాన వన శాఖాధికారి తెలిపారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.160
రెండోరకం	రూ.70	రూ.108

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 169 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	643	665
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 105.06 కిలోలు



రాజంపేట: దుస్తుల దుకాణంలో కిక్కిరిసిన ప్రజలు



అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు

సంక్రాంతి వచ్చిందే.. తుమ్మెదా

సంక్రాంతి..ఇది ఒక పండుగ మాత్రమే కాదు. ఎన్నెన్నో అనుభూతులు, మరెన్నో మేళవింపులు..భావోద్వేగాలు..ఒక మాటలో చెప్పాలంటే ఏడాదికి సరిపోయే ఎన్నో తీపి జ్ఞాపకాల సంబరం..అలాంటి పండుగ మరో వారంరోజుల్లో రానుంది. అంతకన్నా ముందే జిల్లాలో పండుగ జోష్ మైదలైంది. ముగ్గులతో ఇంటి ముంగిళ్లు కళకళలాడుతున్నాయి. పట్టణాల్లోని వారే కాక గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా షాపింగ్ కోసం ఆయా ప్రాంతాల్లోని పట్టణాలకు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 వరకు పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ రద్దీగా మారాయి. దుస్తుల దుకాణాలు, కిరాణా షాపులు కిక్కిరిస్తున్నాయి.సింహభాగం వ్యాపారం దుస్తులు, వంట సరుకుల ద్వారానే సాగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మహిళలు అలంకరణకు సంబంధించిన వస్తువలను జోరుగా కొనుగోలు చేస్తున్నారు.

- రంగవల్లులతో అందంగా తయారైన ముంగిళ్లు
- ఊపందుకున్న పెద్దపండుగ వ్యాపారం

రాజంపేట టౌన్ : పండగంటే ఆఫర్లు....ఆఫర్లుంటేనే ఆకర్షణ. ఇదే మంత్రాన్ని అనేక మంది వ్యాపారులు పాటిస్తున్నారు. కొంతమంది ప్రజలను ఆకర్షించేందుకు కొన్ని రకాల దుస్తులు, మహిళలకు సంబంధించిన వస్తువులపై, పాదరక్షలపై డిస్కౌంట్ ఆఫర్లు పెట్టారు. గత వారం రోజులుగా రోజు, రోజుకు వ్యాపారాలు ఊపందుకుంటున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా నిత్యం కోట్ల రూపాయిల్లోనే వ్యాపారాలు సాగుతున్నట్లు సమాచారం.

ఆన్‌లైన్‌లో జోరుగా కొనుగోళ్లు

ప్రస్తుతం అందరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. దీంతో చాలా మంది ఆన్‌లైన్ ద్వారా షాపింగ్ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో ఆన్‌లైన్‌లో ఎల్రక్టానిక్ వస్తువులను ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం సంక్రాంతి కావడంతో పురుషులు ఫ్యాంట్లు, షర్ట్స్, షూస్, మహిళలు చీరలు, చిన్నపిల్లల దుస్తులు, రోల్డ్‌గోల్డ్ అలంకరణ వస్తువులను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ౼.హిం

దువులకు సంక్రాంతి పెద్దపండుగ.అందువల్ల నిరుపేదలు కూడా ఈ పండుగను ఉన్నంతలో ఘనంగా జరుపుకుంటారు. బంధువులను, ఆడబిడ్డలను, అల్లుళ్లనువిధిగా ఆహ్వానిస్తారు. ఇంటికి వచ్చిన అతిథులకు వారివారి స్థోమతను బట్టి దుస్తులు పెట్టి, ఆతిథ్యాలు ఇస్తారు. సంక్రాంతి సందర్భంగా పేదలకైనా తక్కువలో తక్కువ అంటే పదివేల రూపాయిలు ఖర్చవుతుంది. ఎక్కువ సంఖ్యలో బంధు వర్గం కలిగిన ధనవంతులు సంక్రాంతికి లక్ష రూపాయిలు కూడా ఖర్చు చేస్తారు.

సంప్రదాయాన్ని పాటిస్తాం



పెద్దపండగ సంవత్సరానికి ఒకసారి వస్తుంది. మేము చిన్నప్పటి నుంచి ఇంటిల్లిపాది సంక్రాంతికి కొత్త దుస్తులు కొంటాం. కాలం మారినా ఈ సంప్రదాయాన్ని మాత్రం పాటిస్తున్నాం.పండుగను ఉన్నంతలో సంతోషంగా జరుపుకోవాలి. – సిద్దమ్మ, వెంకటాపురం, ఓబులవారిపల్లె మండలం



ముత్యాల ముగ్గులు..అందమైన ముంగిళ్లు

కడప కల్చరల్: సంక్రాంతి వస్తుందంటే ఇళ్ల ముంగిళ్లు సప్తవర్ణాల హరివిల్లలవుతాయి. మహిళలు ఇప్పటికే ఇళ్ల ముందు అందమైన ముగ్గులను కనుల పండువగా తీర్చిదిద్దుతున్నారు. సాధారణంగా మహిళలు తమ ముగ్గుల్లో కొత్తదనం చూపేందుకు ఉత్సాహం చూపుతుంటారు. పత్రికల నుంచి సేకరించుకున్న ముగ్గుల్లో కొద్దిమార్పులు చేసి తమదైన శైలిలో రంగులు అలంకరిస్తుంటారు. ప్రస్తుతం వారికి సమస్య లేకుండా ముగ్గల పుస్తకాలు మార్కెట్లలో అందుబాటులోకి వచ్చాయి. వీటికి జిల్లా అంతటా డిమాండ్ ఉంది.

రంగురంగుల పుస్తకాలు

ముగ్గు చక్కగా కుదిరితే.. దాన్ని అందరూ ప్రశంసిస్తుంటే అతివలు మురిసిపోతుంటారు. ముత్యాల ముగ్గులు వేయాలన్న తపన ఉన్నా వేయలేని వారి కోసం మార్కెట్‌లో దాదాపు 30 రకాల ముగ్గుల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 20 నుంచి 40 పేజీలతో ఒక పేజీకి ఒకటి నుంచి నాలుగు రంగుల ముగ్గులను ప్రచురిస్తున్నారు. ఇందులో చుక్కల ముగ్గులు, డిజైన్ ముగ్గులు, కాన్సెప్ట్ ముగ్గులు కూడా ఉన్నాయి. ఎన్ని చుక్కలు పెట్టాలో, ఎలా కలపాలో, రంగులు కాంబినేషన్ వివరాలు ఈ ముగ్గుల వద్ద రాసి ఉంటాయి. ఒకటి, రెండుసార్లు సాధన చేసి నేరుగా 'ముగ్గు'లోకి దిగేయడమే ఆలస్యం. సంక్రాంతికి పది రోజుల ముందు నుంచి ఈ పుస్తకాలకు మంచి డిమాండ్ ఉంటోంది. సంక్రాంతి దగ్గర పడుతుండడంతో ఇళ్ల ముందు మహిళలు పోటీల కోసం సాధన చేయడంలో భాగంగా రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దుతున్నారు.సీజన్ మాత్రమేగాక మిగతా రోజుల్లో కూడా ముగ్గుల పుస్తకాలకు డిమాండ్ ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

సంజీవరాయా..కరుణించవయ్యా..

- ఘనంగా స్వామికి పొంగళ్లు
- పురుషులు మాత్రమే నైవేద్యం సమర్పణ
- ఎక్కడాలేని వింత ఆచారం

పుల్లంపేట: పుల్లంపేట మండలం, తిప్పాయిపల్లి గ్రామంలో ఆదివారం సంజీవరాయస్వామికి పొంగళ్లు ఘనంగా నిర్వహించారు. 1516 సంవత్సరం పూర్వీకుల కాలం నుంచి ఇప్పటి వరకు మహిళలకు ఆలయంలో ప్రవేశం ఉండదు. పురుషులే స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రసాదాలను కూడా వారే పంచిపెట్టడం ఆనవాయితీ. గ్రామస్తులు కథనం మేరకు తమ పూర్వీకులు పాడి ఆవులు మేపుకుంటూ జీవనం సాగించేవారు. అప్పట్లో గ్రామంలో వంద ఆవులు వింత వ్యాధి సోకి మరణించాయి. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఆసమయంలో అడవిలో ఒక మునీశ్వరుని వద్దకు వెళ్లి ఆవుల వింతవ్యాధి గురించి వివరించారు. దీంతో ఆ సాధువు మీకు ఒక బండరాయిపై బీజాక్షరంతో ఒక శిలాఫలకం అందజేస్తానని, దానిపై గుడి నిర్మించరాదని, మహిళలకు ప్రవేశం లేదని, మహిళలకు ప్రసాదాలు పంపిణీ చేయరాదని సాధువు వారికి సూచించారు. వారిచ్చిన శిలాఫలకాన్ని గ్రామంలో ప్రతిష్టించినప్పటి నుంచి గ్రామంలో పాడిపశువులు అభివృద్ధి చెందడంతోపాటు పంటలు బాగా పండుతున్నాయని ప్రజల నమ్మకం. అప్పటి నుంచి ఇప్పటి వరకు తమ పూర్వీకులు ఆచరించిన ఆచారాన్ని ఆచరిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఏడాది సంక్రాంతికి ముందు వచ్చే ఆదివారం పురుషులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ. నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి కుటుంబ సమేతంగా సంజీవరాయ స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి స్వామివారిని దర్శించుకొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశవ రెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకారంలో సంజీవరాయస్వామి, స్వామివారికి నైవేద్యం సమర్పిస్తున్న పురుషులు

ప్రతిపక్షాల కుట్రలు సాగవు

- ప్రజల్లో విశ్వాసం, ఆదరణ ఉంటే ఇతర పార్టీలతో పొత్తులెందుకు
- చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల కుట్రలు సాగవని వైఎస్‌ఆర్ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ప్రభుత్వ విప్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని జెడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుంటూరు, కందుకూరు ఘటనల తర్వాత కూడా ప్రభుత్వం స్పందించకపోతే చేతకానితనమే అవుతుందన్నారు. ప్రజల రక్షణ బాధ్యత ఈ రాష్ట్ర ప్రభుత్వానికి లేదా అంటూ బాబు అండ్ కోను ప్రశ్నించారు. జీఓ నంబర్-1 వైఎస్‌ఆర్‌సీపీకి కూడా వర్తిస్తుందన్న విషయం వారికి తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేని విశాలమైన ప్రాంతాలలో ప్రభుత్వ అనుమతులతో సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలని జీఓ విడుదల చేయడం తప్పా అని అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను పరిశీలిస్తే చంద్రబాబుకి ఓటమి భయం పట్టుకుందన్నారు. తమకు ప్రజాబలం ఉందని, జగన్ ఓడిపోవడం ఖాయమని బాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్‌ఆర్‌సీపీకి 86 శాతం ప్రజల్లో ఆదరణ ఉందనడానికి సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. బాబుకు ప్రజాబలం, ప్రజల్లో విశ్వాసం ఉంటే జగన్‌ను ఎదుర్కొనేందుకు అన్ని పార్టీల నాయకుల దగ్గరికి వెళ్లి అడుక్కోవడం ఎందుకని అన్నారు. రానున్న ఎన్నికలలో పవన్, బాబులు కాకపోతే మరో పదిమందితో కలవండని, ఈ ప్రజాస్వామ్యంలో ఎవరూ వద్దనడం లేదన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ మీకు మంచి జరిగి ఉంటేనే నన్ను ఆదరించండంటూ దమ్మున్న వ్యక్తిగా సీఎం జగన్ ప్రజల ముందుకు వెళ్తున్నారన్నారు. బాబు చెప్పుకుంటున్నట్లు ఆయనకు నిజంగానే ఇవి చివరి ఎన్నికలన్నారు. రాష్ట్ర సంక్షేమాన్ని, అభివృద్ధిని కాంక్షిస్తూ సీనియర్ నాయకుడిగా చంద్రబాబు సలహాలు, సూచనలిస్తే పాటించేందుకు వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం కలిగించిన హక్కు అన్నారు. దేశంలో ఎంజీఆర్, మమతాబెనర్జీ, జగన్, కేజ్రీవాల్ మాదిరిగా స్వంత పార్టీ పెట్టుకుని ప్రజాదరణ పొందాలని చంద్రబాబుకు హితవు పలికారు.

కొత్త ప్రయోగం.. లాభాలు అధికం

- మల్చింగ్ షీట్ల ఏర్పాటుతో హైబ్రిడ్ బోండా మిర్చి సాగుకు శ్రీకారం
- మంచి దిగుబడి ఇస్తున్న పంట
- జిల్లాలో 1850 హెక్టర్లలో సాగు

గుర్రంకొండ: వ్యవసాయంలో రైతులు విన్నూత్న ప్రయోగం చేపట్టారు. కొత్తరకం హైబ్రిడ్ బోండా మిర్చి సాగును చేపట్టారు. టమాటా సాగు చేసే పద్ధతిలో మల్చింగ్‌షీట్లు ఏర్పాటు చేసి కొత్తగా బోండా మిర్చిని సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో మంచి ఫలితాలతో పాటు అధిక దిగుబడులు కుడా వస్తున్నాయి.ప్రస్తుతం మార్కెట్లో కిలో హైబ్రిడ్‌ బోండామిర్చి అత్యధికంగా రూ. 25వరకు ధరలు పలుకుతున్నాయి. దీంతో జిల్లాలో టమాటా, పూలసాగుతో పాటు రైతులు హైబ్రిడ్ బోండామిర్చి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

హైబ్రిడ్ బోండా మిర్చి పంట సాగు జిల్లాలో 1850 హెక్టార్లలో చేపట్టారు. పొలం బాగా దుక్కులు చేసిన తర్వాత టమాటా సాగుకు ఏర్పాటుచేసినట్లు నాలుగు అడుగులకొక గడ్డను వెడల్పుగా ఏర్పాటు చేసుకోవాలి. ముందుగా మల్చింగ్ షీట్లు గడ్డపై పరిచి వాటిపై రంధ్రాలు చేయాల్సి ఉంటుంది. వాటికి అనుగుణంగా డ్రిప్‌పైపులు ఏర్పాటు చేసి నారు మొక్కలు నాటుకోవాలి. మొక్కలు బాగా పెద్దవయ్యాక టమాటా సాగులో మాదిరిగా కట్టెలు నాటే విధానం ద్వారా చెట్లను ఏపుగా ఆరోగ్యకరంగా పెరగనీయవచ్చు. తద్వారా అధిక దిగుబడులు వస్తాయి. వర్షాలు కురిసినా మల్చింగ్‌షీటు, సీడ్‌కట్టెల ఏర్పాటుతో కాయలు దెబ్బతిని కుళ్లిపోకుండా నాణ్యతగా ఉంటాయి.



కొత్తపల్లెలో మల్చింగ్ షీట్లు ఏర్పాటుచేసి సీడ్ కట్టెలతో సహా కొత్తగా సాగు చేసిన హైబ్రిడ్ బోండామిర్చి తోటలు

ఎకరాకు రూ. 1.50 లక్షలు ఖర్చు

హైబ్రిడ్ బోండా మిర్చి సాగుకోసం మల్చింగ్ విధానంలో ఎకరానికి రూ.1.20 నుంచి రూ. 1.50 లక్షల వరకు ఖర్చు అవుతుంది. పూత,పిందెలు నిలవడానికి, కాయలు ఏపుగా పెరుగడానికి, చీడపీడల నివారణ కోసం వారంలో ఒక రోజు తప్పనిసరిగా మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. మిగతా పంటలతో పోల్చితే హైబ్రిడ్ బోండా మిర్చిసాగుకు మందుల వినియోగం తక్కువగా ఉంటుంది.అయితే కాయలు వంకరులు పోకుండా నేరుగా పొడవుగా పెరగడానికి ప్రత్యేక మందులు వినియోగించాల్సి ఉంటుంది. నారుమొక్కలు నాటిన 90 రోజులుకు కాయల కోత ప్రారంభమవుతుంది.

ఎకరం బోండా మిర్చి సాగుకు 20 నుంచి 25 టన్నుల దిగుబడి వస్తుంది. సాధారణ మిర్చి ఎకరానికి 10 టన్నుల లోపే దిగుబడి వస్తుంది.

కిలో రూ. 25:

ప్రస్తుతం మార్కెట్లో కిలో బోండా మిర్చి ధర రూ.25వరకు పలుకుతోంది. ఎకరం పంట సాగులో ఒక కోతకు ఒకటి నుంచి ఒకటిన్న టన్నుల వరకు కాయల దిగుబడి వస్తుంది. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం టన్ను కాయలు రూ. 25వేల వరకు ధరలు ఉన్నాయి. ఈలెక్కన ఎకరం సాగుకు రూ. 5లక్షల నుంచి రూ. 6.25లక్షల ఆదాయం వస్తుంది. సాగు పెట్టుబడిఖర్చు, రవాణా, కోతకూలీలు ఖర్చు పోను ఎకరానికి రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు లాభాలు వస్తున్నాయి.హైబ్రీడ్ బోండా మిర్చి రవాణా ప్రత్యేక ప్యాకింగ్ ద్వారా పంపాల్సి ఉంటుంది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రధాన పట్టణాల్లో వీటికి మార్కెటింగ్ ఉంది. ఇక్కడి రైతులు బయట రాష్ట్రాల మార్కెట్‌లకే హైబ్రీడ్ బోండా మిర్చి ఎగుమతి చేస్తుంటారు.

దిగుబడి బాగుంది



సాధారణ మిర్చి పంటతో పోల్చితే హైబ్రీడ్ బోండా మిర్చి సాగుతో దిగుబడి బాగుంటుంది. మన ప్రాంతంలో సాగు చేసే మిర్చి ఎకరానికి ఎనిమిది నుంచి పది టన్నుల లోపు దిగుబడి వస్తుంది. అయితే హైబ్రిడ్ రకం మిర్చి సాగుతో 20 నుంచి 25 టన్నుల దిగుబడి వస్తుంది. – వెంకట్రమణ, రైతు, కొత్తపల్లె

ప్రత్యేక ప్యాకింగ్‌తో ఎగుమతి చేస్తాం



హైబ్రిడ్ బోండా మిర్చిని సాధారణ మిర్చిలా కాకుండా ప్రత్యేక ప్యాకింగ్ ద్వారా బయట రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటాం. టమాటా క్రేట్‌లు, ప్యాకింగ్ అట్టపెట్టెల్లో భద్రపరిచి వాహనాల్లో పంపిస్తుంటాం. – చలపతి, రైతు, కొత్తపల్లె

కొత్తరకం పంటతో లాభాలే



కొత్తరకం పంట హైబ్రిడ్ బోండా మిర్చి సాగుతో రైతులకు లాభాలు వస్తాయి. మార్కెట్లో ధరలు నిలకడగా ఉంటే మంచిలాభాలు వస్తాయి.మార్చి, ఏప్రిల్‌నెలల్లో వీటిధరలు పెరుగుతుంటాయి. –లక్ష్మీప్రసన్న,ఉద్యానవనశాఖాధికారి, వాల్మీకిపురం క్లస్టర్

ఇన్‌స్పైర్‌మనాక్‌కు 272 ప్రాజెక్టులు ఎంపిక



జిల్లాకు ఎంపికైన ప్రాజెక్టును పరిశీలిస్తున్న జిల్లా సైన్స్ అధికారి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి 2022–23వ విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనాక్‌కు 1986 నామినేషన్లను అప్‌లోడ్ చేయగా నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు వీటిలో సృజనాత్మకమైన 272 ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. 272 మందికి వారి ఖాతాలకు పది వేల రూపాయలు జమ అవుతుంది. ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా నుంచి ఎంపికైన 272లో పునర్విభజన తర్వాత మిగిలిన వైఎస్సార్‌జిల్లా నుంచి 182, నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు 90 ప్రాజెక్టులు ఉన్నాయి. ఎంపికైన విద్యార్థులకు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు డీఈఓ దేవరాజు, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి అభినందనలు తెలిపారు.

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

హాకీ ఎంపికలకు చక్కటి స్పందన



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్ : కడప డీఎస్ఏ క్రీడామైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి హాకీ ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలకు ముఖ్యఅతిథిగా కడప డిప్యూటీ మేయర్ బి. నిత్యానందరెడ్డి, శాప్ డైరెక్టర్ మైఖేల్ డానియల్ ప్రదీప్ కుమార్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి ఎంపికలను ప్రారంభించారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. సీనియర్ హాకీ క్రీడాకారుడు ఎం.శేఖర్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా మహిళల జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు శ్రీనివాసులు, చూడామణి, విలియం, చిన్న, ప్రవీణ్, ఖాన్, దీపు, శౌరి, శ్రీనాథ్, కోచ్‌లు రమేష్‌బాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళల జట్టు :
ఎస్.నరసింహ, పి.జ్యోతి, డి.చిన్ని, డి.ఝాన్సీ, ఆర్.శైలజ, టి.శైలజ, ఎం.లావణ్య, ఎల్.హారతి, లక్ష్మీచరిత టి.శ్రీవిద్య, పుష్పావతి, ప్రవల్లిక, సౌజన్య, యమున, చందు, శ్రీజయబాయ్, షహాన, సుచిత్ర మేనేజర్ : వెంకటేష్, కోచ్ : అమీర్.

నూతన కార్యవర్గం ఏర్పాటు

వైవీయూ : ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ జనరల్ ప్రెసిడెంట్‌గా ఆచార్య కిరణ్‌క్రాంతి చౌదరి, ఉపాధ్యక్షులుగా డా.ఎ.ఆర్.రెడ్డి, కె.వి.రమణమూర్తి, డా.బి.ఆర్.ప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డా.ఎం.శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కె.సూర్యనారాయణ, డా.వై.రఘు, డా.జి.సురేంద్ర, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డా.అరవింద్‌కుమార్, డా.ఎన్.కృష్ణారెడ్డి, డా.వి.శ్రీనివాస్, డా.ఖాజావలి, డా.ఎస్.మహబూబ్‌బాషా, డా.జి.రామకృష్ణ, డా.బడే సాహెబ్, డా.సయ్యద్ మీర్‌అహ్మద్, డా.ఎస్.రాజ్‌మహ్మద్, డా.కె.సుధాకర్, డా.సోమశేఖర్, డా.లక్ష్మీరూపవాణి, డా.లీలావతి, కె.గంగయ్య ఎన్నికయ్యారు.

తగ్గేదేలే!



గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి బరికి సై అంటూ పందెంకోళ్లు కాలు దువ్వుతున్నాయి. పండుగ దగ్గర పడినకొద్దీ సమరోత్సాహంతో కదం తొక్కుతున్నాయి. పందెం కోళ్లకు డిమాండ్ పెరుగుతోంది. రహస్య ప్రాంతాల్లో కోడిపందేలు జరుగుతుంటాయి. ఈ యేడాది కోడిపందాలు ఎలా జరుగుతాయో అనేది చర్చనీయాంశంగా మారింది.

- సిద్ధమవుతున్న పందెం కోళ్లు
- ఆచారంలో భాగమే అంటున్న పల్లెవాసులు
- నిషేధం ఉన్నా..కంటికి రెప్పచాటుగా..
- కోడిపందేల స్థావరాలపై ఖాకీల కన్ను

రాజంపేట : సంక్రాంతి వచ్చిందంటే చాలు అందరికీ గుర్తుకొచ్చేది పాడిపంటలు.. ముగ్గులు.. పిండివంటలు.. వాటితోపాటు కోడిపందాలు కూడా ముఖ్యంగా రాయలసీమ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గుట్టుచప్పుడుగా కొనసాగుతాయి. జోరుగా పందాలు కాస్తారు. కోడిపుంజు బరిలోకి దిగితే చాలు అది చచ్చే వరకు ప్రత్యర్థితో పోరాడుతూ ఉంటుంది. సంక్రాంతికి ఆరునెలల ముందు నుంచే శిక్షణ ఇస్తూ, పోషకాహారం పెండుతూ పెంచుతారు. ఈ సంకాంత్రి పండుగ అన్ని రోజులు కోడిపందేలు నిర్వహించే ప్రాంతాల్లో జనసందోహం కనిపిస్తుంది. జిల్లాలో కోడి పందాల జోరు క్రమకమంగా ఊపందుకునే పరిస్థితులు నెలకొన్నాయి. ఆచారంలో భాగమే ఈ పందాలు అని పల్లెవాసులు అంటున్నారు. నిషేధం ఉన్నా కంటికి రెప్పచాటుగా పందాలు నిర్వహించుకునేందుకు పందెంరాయుళ్లు సిద్ధమవుతున్నారు. పోలీసుశాఖ ఏ స్థాయిలో కట్టడి చేస్తుందో వేచి చూడాల్సిందే.

కోడి పందాలు ఎప్పటి నుంచి..
ఇంతటి ప్రాచుర్యం తెచ్చుకున్న ఈ కోడిపందాలు ఎప్పుడు ప్రారంభమయ్యాయి. వీటిని ఎందుకు నిర్వహిస్తున్నారు. దీని వెనుక ఉన్న చారిత్రక కారణాలేంటి అనే విషయాన్ని ఓసారి పరిశీలిస్తాం. సాధారణంగా ఏ పక్షి మనుషులతో కలిసి జీవించేందుకు ఇష్టపడదు. వాటిని ఎంత మచ్చిక చేసుకున్నా ఎగిరిపోతుంటాయి. కానీ కోళ్లు మాత్రం మనుషులతో మచ్చికగా ఉంటాయి. దీనికి కారణం అవి తీసుకునే ఆహారం, మనుషులకు దగ్గరగా ఉండటమే కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. సింధూ నాగరికత కాలమైన క్రీస్తు పూర్వం 3వ శతాబ్దం నుంచి మానవుడు వీటిని పెంచినట్లుగా తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 10వేల రకాల కోళ్ల జాతులు ఉన్నట్లుగా అధ్యయనంలో వెల్లడైంది. గద్దలు వంటి భీకర పక్షులతో పందేలు నిర్వహించడం కష్టం. అందుకే అలవాటైన కోళ్లతో మనిషి వినోదం పొందుతున్నాడని పలువురు విశ్లేషిస్తున్నారు.

నిషేధం ఉన్నా..
నేటి పరిస్థితుల్లో జీవహింసను నేరంగా పరిగణించి కోర్టులు కోళ్లకు కత్తులు కట్టడాన్ని తప్పుబడుతూనే ఉన్నాయి. పోలీసులు కూడా బరులకు అనుమతులు ఇవ్వడంలేదు. అయినా ప్రతి యేటా అలా పందాలు జరిగిపోతూనే ఉన్నాయి. దీన్ని తరతరాలుగా వస్తున్న ఆచారంగా చెబుతున్నారు. కొంతమంది రాజకీయనాయకులు నేరుగా ఈ పందాల్లో పాల్గొంటూనే ఉన్నారు. సంకాంత్రి పండుగ మూడురోజులు డబ్బులు పెద్దఎత్తున చేతులు మారతాయనేది బహిరంగ రహస్యం.

కోడిపందాల కోళ్లు ఇవే..
కోడిపందాల కోళ్లు ప్రధానంగా బరిలో దిగే రకాలను పందెంరాయుళ్లు ఎంచుకుంటారు కాకి, కాకినెమలి, రసంగి, సేతువ, నెమలి, అబ్రాసు, పండు డేగ, డేగ రకాలకు చెందిన కోళ్లను బరిలోకి దించుతారు. గ్రామాల్లో డింకీ పందాలు అంటే కోళ్లకు కత్తులు లేకుండా నిర్వహించే పందాలను రహస్యంగా నిర్వహించేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు పందాల స్థావరాలను గుర్తించే పనిలో పోలీసుశాఖ నిఘావర్గాలు ఉన్నాయని సమాచారం.

జోరుగా పందెం పుంజుల విక్రయాలు..
సంక్రాంతి పండుగ సమీపిస్తున్న క్రమంలో కోడిపందాలకు చాపకింద నీరులా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పందెం పుంజుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పందెం బరిలో నిలిచే పుంజుల ధర రూ.15వేల నుంచి రూ.30వేల వరకు పలుకుతోంది.

జిల్లాలో...
జిల్లాలో రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె ప్రాంతాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో కోడిపందాలు జరుగుతాయి. కానీ సర్కారు ఏరియాలో జరిగే కోళ్లపందేలకన్నా తక్కువ స్థాయిలో జరుగుతాయని భావిస్తున్నారు. గతంలో గుర్తించిన కోడిపందాల స్థావరాలపైన, కేసులో ఉన్న పందెంరాయుళ్ల కదలికలపై నిఘా ఉంచారు. కోడిపందేల నిర్వహణకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకబృందాలను రంగంలోకి దింపుతున్నారు.

కోడిపందేలకు అడ్డుకట్టవేసే దిశగా చర్యలు



కోడిపందేల నిర్వహణ చట్టవిరుద్ధం. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు. జిల్లాలోని మూడు సబ్‌డివిజన్ల పరిధిలో కోడిపందేలకు అడ్డుకట్ట వేసే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాము. బైండోవర్ కేసులు పెడుతున్నాము. స్పెషల్ పార్టీలతో దాడులు నిర్వహించేందుకు సర్వం సిద్ధంచేశాము.

– హర్షవర్ధన్‌రాజు, జిల్లా ఎస్పీ

రూ.14.77 కోట్లతో మామిడి గుజ్జు పరిశ్రమ

డీహెచ్‌ఓ రవిచంద్రబాబు



మాట్లాడుతున్న డీహెచ్‌ఓ రవిచంద్రబాబు

పీలేరు రూరల్ : జిల్లాకు రూ. 14.77 కోట్లతో మామిడి, టమాట గుజ్జు పరిశ్రమ మంజూరైందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. ఆదివారం మండలంలోని తలపుల అన్నమయ్య రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పీలేరులో అన్నమయ్య, ఎర్రవారిపాళెంలో ఇద్దేశ్వర, మదనపల్లెలో మర్యాదరామన్న, నిమ్మనపల్లెలో నిమ్మనపల్లె రైతు సహకార సంఘాలు ఉన్నాయన్నారు. అన్నమయ్య, సిద్దేశ్వర సహకార సంఘాలకు రూ. 14.77 కోట్లతో మామిడి గుజ్జు పరిశ్రమ ఏపీఐఎల్ ఐపీ–2 (జైకా) ప్రాజెక్టు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తలపులలో పరిశ్రమ మంజూరైందన్నారు. ఇప్పటికే స్థల పరిశీలన పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. తలపులకు రూ.45 లక్షలతో మూడు కలెక్షన్ సెంటర్లు మంజూరయ్యాయని చెప్పారు. మామిడి రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తిరుపతికి చెందిన చీనీ, నిమ్మ, మామిడి పరిశోధన శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడి వస్తుందన్నారు. గత ఏడాది 20 శాతం మాత్రమే పంట వచ్చిందని, ఈ సంవత్సరం మామిడి ఆశాజనకంగా ఉందని తెలిపారు. పంట పూర్తయిన తరువాత శాస్త్రీయ పద్ధతుల ద్వారా మొక్కల కత్తిరింపు, పిచికారీ, ఎరువులు, నీరు అందిస్తే పూత సకాలంలో వచ్చి పంట దిగుబడి బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి సుకుమార్‌రెడ్డి, రైతు సలహామండలి సభ్యులు బోదేషావలి, ధర్మారెడ్డి, గ్లోబర్ ఫ్యాక్టరీ పల్ప్ ఇండస్ట్రీ ఎండీ ఉమాపతిరెడ్డి, ఏపీఐఎల్‌ఐపీ ఏపీడీ కుమార్, సర్పంచ్ సందీప్‌రెడ్డి, అన్నమయ్య రైతు సహకార సంఘం అధ్యక్షుడు జయబ్బనాయుడు, కార్యదర్శి సురేంద్రనాయుడు, సభ్యులు చక్రపాణిరెడ్డి, తిమ్మయ్య, సురేంద్రరెడ్డి, అంజి, రామ్మోహన తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



ప్రమాదానికి గురైన ట్రాక్టర్

బి.కొత్తకోట : కలికిరి నుంచి ఎరువుల లోడుతో వస్తున్న ట్రాక్టర్ జాతీయరహదారిపై ప్రమాదానికి గురై బోల్తా పడిన సంఘటన ఆదివారం జరిగింది. బి.కొత్తకోట మండలం శెట్టిపల్లెకు చెందిన మంజుకు ట్రాక్టర్ ఉంది. కలికిరి మండలం నుంచి ఎరువును తీసుకొచ్చేందుకు డ్రైవర్ మహేంద్ర ట్రాక్టర్‌ను తీసుకుని వెళ్లాడు. ఎరువు లోడుతో ట్రాక్టర్ బి.కొత్తకోటకు వస్తుండగా కురబలకోట మండలం చెన్నామర్రిమిట్ట దాటుకొన్న కొద్దిసేపటికి మదనపల్లె వైపు వెళ్తున్న లారీ ట్రాక్టర్ ముందరి కుడి చక్రాన్ని ఢీకొంటూ వెళ్లింది. దీనితో ట్రాక్టర్ వెనక్కు మళ్లి పైకి ఎగిరింది. ఎరువుతో ఉన్న ట్రాలీ రోడ్డు పైనే బోల్తా పడింది. ట్రాక్టర్ ఇంజిన్ గాలిలోకి ముందరి చక్రాలపై వ్రేలాడుతూ నిలబడిపోయింది. దీంతో కొంతసేపు జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకొన్నారు. ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ మహేంద్రను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించలేదు.

మద్యం తాగొద్దన్నందుకు కూలీ ఆత్మహత్య



మృతి చెందిన మునిరాజ

బి.కొత్తకోట : మద్యానికి బానిసైన భర్తకు ఆ అలవాటు మానుకొమ్మని చెప్పడమే ఆమె పాలిట శాపమైంది. భార్యపై అలక వహించిన భర్త సొంతూరికి వెళ్తున్నట్టు చెప్పి గ్రామానికి సమీపంలోని పొలంలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో వెలుగు చూసింది. ఎస్ఐ కె.రామమోహన్ తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లె తాలూకా గౌరిబిదనూరుకు చెందిన పూసల మునిరాజ (30)కు బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామం కంబాలపల్లెకు చెందిన శోభతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. మునిరాజ కూలి పనులకు వెళ్తూ కంబాలపల్లెలోనే స్థిరపడిపోయాడు. అయితే మునిరాజకు మద్యం సేవించే అలవాటు ఉండటంతో తరచూ భార్య శోభతో గొడవపడేవాడు. దీంతో మద్యం తాగవద్దని, మానుకోవాలని భార్య చెప్పేది. ఈ నేపథ్యంలో ఈనెల 6న తన సొంతూరు గౌరిబిదనూరుకి వెళ్లి వస్తానని భార్యతో చెప్పి వెళ్లాడు. భార్య స్వగ్రామానికి వెళ్లి ఉంటాడని భావించింది. ఆదివారం శంకరాపురం సమీపంలోని చర్చి ఎదురుగా ఉన్న పొలంలో రైతు రవి, అతని బావమరిది మొక్కజొన్న కంకులు తీసేందుకు వెళ్లారు. కంకులు తీస్తుండగా పొలంలో మునిరాజ శవమై కనిపించడంతో కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కుటుంబీకులు మృతదేహం వద్దకు రాగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించారు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మునిరాజ మృతిపై సమగ్ర విచారణ చేపట్టామని, పోస్టుమార్టం నివేదికలో మృతికి కారణాలు వెలుగు చూస్తాయని ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆదివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ములకలచెరువు మండలం సారగుండ్లపల్లెకు చెందిన ఆనంద్ (40) ఈనెల 7న ద్విచక్రవాహనంలో వెళుతూ తంబళ్లపల్లె మండలం ఎద్దులోళ్లపల్లె క్రాస్‌లో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యు లు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతిలో చికిత్స పొందుతున్న ఆనంద్ ఆదివారం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కన్నెమడుగు గ్రామంలో తన చిన్నాన్న మృతి చెంది ఉండటంతో దశదిన కర్మలకు వెళుతుండగా ప్రమాదవశాత్తు రోడ్డుప్రమాదంలో ఆనంద్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. తంబళ్లపల్లె పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోబోల్తా– ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన ఇమాంబీ

మదనపల్లె : ఆటోబోల్తా పడి అన్నమయ్య జిల్లా కురబలకోటకు చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన చిత్తూరుజిల్లా పుంగనూరు మండలంలో ఆదివారం జరిగింది. కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎస్.ఇమాంబీ(50), భర్త ఎస్.సత్తార్ సాబ్(60) కుమారుడు ఎస్.మహబూబ్‌బాషా(31)తో కలిసి ఆటోలో పుంగనూరుకు బయలుదేరారు. ఇమాంబీకి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో నాటువైద్యం చేయించేందుకు పుంగనూరుకు వెళుతుండగా భీమగానిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో డ్రైవింగ్ చేస్తున్న మహబూబ్‌బాషా ఆటోను పక్కకు తిప్పడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితులను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇమాంబీ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. పుంగనూరు పోలీసులకు స్థానిక అవుట్‌పోస్ట్ పోలీసులు సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడికి తీవ్ర గాయాలు
రోడ్డుప్రమాదంలో అక్కా తమ్ముడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం గుర్రంకొండ మండలంలో జరిగింది. బి.కొత్తకోటకు చెందిన వెంకటప్ప కుమారుడు ఈ.రమేష్(35) అక్క మల్లీశ్వరి(38), కుమార్తె జోషిత(4)తో కలిసి ద్విచక్రవాహనంలో కొత్తకోట నుంచి రాయచోటికి బయలుదేరారు. మార్గమధ్యంలో గుర్రంకొండ సమీపంలోని టమాటా మార్కెట్ వద్ద మరో ద్విచక్రవాహనం ఎదురుగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో రమేష్, మల్లీశ్వరిలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు ఆటోలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గుర్రంకొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కురుబ, కురమ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎంపిక



కురబ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బలశ్రీనివాసులును సన్మానిస్తున్న కార్యవర్గసభ్యులు

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ కురుబ, కురమ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఆదివారం ప్రకటించారు. మదనపల్లెలోని కురబ సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రాష్ట్ర కురుబ, కురమ సంఘం అధ్యక్షుడిగా జబ్బల శ్రీనివాసులు (అన్నమయ్య జిల్లా), గౌరవ అధ్యక్షుడిగా తట్టి అర్జునరావు(కృష్ణ, గోదావరి), జనరల్ సెక్రటరీగా వి.లింగమూర్తి (అనంతపురం), ట్రెజరర్‌గా కె.వి.చలపతి(హిందూపురం), వైస్ ప్రెసిడెంట్‌గా కోటకొండ నాగేశ్వరరావు(కడప), కె.రెడ్డికుమార్(తిరుపతి), కార్యదర్శులుగా వల్లిగట్ల వెంకటరమణ(పీలేరు), కె.సీతారామయ్య(నంద్యాల), బీరయ్య బుద్ధా(గుంటూరు), పోతప్ప గివ్విమణి(అనంతపురం), బి.నాగేంద్ర(అనంతపురం), పి.నాగభూషణం(చిత్తూరు), డి.కె.రమణ్ రామాంజనేయులు(అనంతపురం), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కన్నేకల్ బాబు(కర్నూలు), కె.ఎస్.నంజుండప్ప(హిందూపురం), విఠల్‌గౌడ్ చిరుతల్ల(అనంతపురం), జి.రెడ్డెన్న(కడప), బి.శ్రీనివాసులు (నంద్యాల), గోవిందరావు కడిమి(పశ్చిమగోదావరి), ఆర్.హరినాథ్(చిత్తూరు)లతో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా టి.ఈశ్వరయ్య(అన్నమయ్య), బి.జగదీష్‌బాబు(అనంతపురం), శ్రీనివాసరావు బొమ్మగంటి(కృష్ణా), భూషణం బల్దా(గుంటూరు), వెంకటవాణి యారాసి(పశ్చిమగోదావరి), మల్లేశ్వరి యారాసి(తూర్పుగోదావరి), జి.చంద్రశేఖర్(గుంటూరు), లీగల్ అడ్వైజర్‌లుగా పి.సుంకన్న(కర్నూలు), కె.రవిశంకర్(అన్నమయ్య), సీహెచ్.అంజయ్య(గన్నవరం)లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రెండోసారి అధ్యక్షులుగా ఎంపికైన జబ్బుల శ్రీనివాసులును రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు.

జ్యోతిష్యుడిపై హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్



హత్యాయత్నం కేసులో అరెస్టయిన నిందితులతో పోలీసులు

గుర్రంకొండ : జ్యోతిష్యుడిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రాయచోటి డీఎస్పీ శ్రీధర్ కథనం మేరకు గుర్రంకొండ మండలంలోని సంగసముద్రం పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన పి.మదార్‌ఖాన్ అనే వ్యక్తి గ్రామానికి సమీపంలోని బాబుడన్ కొండ దగ్గర ఉన్న మస్తాన్‌వలీ దర్గాలో తాయత్తులు, జ్యోతిష్యం చెప్పుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. తిరుపతికి చెందిన సయ్యద్ నౌషాద్ స్థానిక గంగమ్మ గుడి వద్ద చిల్లర దుకాణం నిర్వహించుకుంటున్నాడు. 20 ఏళ్లుగా ఆరోగ్యం సరిగ్గా లేనందున మదార్‌ఖాన్ వద్దకు వచ్చి తాయత్తులు కట్టించుకొని వెళ్లేవాడు. ఇటీవల కొంతకాలంగా ఎన్ని తాయత్తులు కట్టినా ఆరోగ్యం బాగుపడక పోవడంతో మదార్‌ఖాన్‌పై అనుమానం పెంచుకొన్నాడు. డబ్బు కోసం మదార్‌ఖాన్ తనపై చేతబడి చేస్తున్నాడనే అనుమానం నౌషాద్‌లో బలపడింది. ఈ నేపథ్యంలో చిత్తూరుకు చెందిన అంబికాపతి ఆనంద్(47), జయకుమార్ జస్టిన్‌కుమార్(20), అబ్దుల్(20), వర్ధన్ మురగన్(50), పూర్ణచంద్ర(19), తాహీర్(19)ల తో పాటు మరో మైనర్ బాలుడికి మదార్‌ఖాన్‌ను చంపేందుకు నౌషాద్ కాంట్రాక్ట్ ఇచ్చాడు. ఈనెల 6వ తేదీన కుమ్మరపల్లె నుంచి మదార్‌ఖాన్ స్కూటీలో దర్గాకు వెళుతుండగా మార్గమధ్యంలో మధ్యాహ్నంవారిపల్లె వద్ద నౌషాద్ అతని అనుచరులు రెండువాహనాలు, ఒక స్కూటర్‌లో వచ్చి అడ్డగించి వేట కొడవళ్లతో దాడికి దిగారు. వారి దాడి నుంచి మదార్‌ఖాన్ తప్పించుకొని గట్టిగా కేకలు వేయడంతో పరిసర పొలాల్లోని రైతులు, గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. దీంతో వారు పరారయ్యారు. అప్పట్లో ఈ సంఘనటపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం తంబళ్లపల్లె– మండెంవారి పల్లె మార్గంలో ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం నాకాబందీ నిర్వహించి నౌషాద్‌తో పాటు అతని అనుచరులను అరెస్ట్ చేశారు. హత్యాయత్నానికి ఉపయోగించిన వాహనాలను సీజ్ చేసి వారిని వాల్మీకిపురం కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును ఛేదించేందుకు సహకరించిన ఏఎస్ఐ నరసింహులు, హెడ్‌కానిస్టేబుళ్లు వేణుగోపాల్, శివప్రసాద్, జగదీష్, బాలసుబ్రమణ్యం, కానిస్టేబుళ్లు ఎస్వీరమణ, వేణుమాధవ్, సురేంద్ర, వినోద్, అర్జున్‌లను అభినందిస్తూ రివార్డుల కోసం సిఫార్సు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.